# అఖండుడు

**ఆ** మనిషికి నూరులోపల ఎంత వయసైనా ఉండొచ్చు. మాట్లాడటం మాత్రం ధాటిగా ఉంది. మాటలు దిగ్భ్రమ కలిగించేవిలా ఉన్నాయి.

" ... నెహ్రూగారితో చెప్పేశాను. 'అబ్బాయీ, ఊగిసలాడక దేశవిభజనని ఒప్పేసుకో. ముందు పని జరగాలి' అన్నాను... ప్రకాశంగారితో ఎంత పోరితే చీఫ్ మినిష్టరు కావటానికి ఒప్పుకున్నాడు."

అలా మాట్లాడుతూ పోతున్నాడు. చార్లీ చాప్లిన్‌ను అమెరికా నుండి వచ్చెయ్యమని తానే చెప్పాట్ట! 'అబ్బాయ్, యుద్ధం బాగా చేయించావు. నీ పని అయిపోయింది. మరి దిగిపో" అని చర్చిల్‌కి చెప్పాట్ట! "దక్షిణ కొరియాలోకి మరీ దూరం వెళ్లకు. దారితప్పి పోగలవు" అని ట్రూమన్‌కి చెప్పాట్ట.

సమయానికి శ్రీశ్రీ లేనందుకు విచారించాను. అట్టడుగున దాగిన చరిత్ర రహస్యం కావాలంటాడు గద శ్రీశ్రీ. ఇదుగో రహస్యం!

"అయ్యా, తమరిప్పుడు మా ఆఫీసుకు ఎందుకు దయచేసినట్టు?" అని ఎవరో అడిగారు.

"మరేం లేదు, మీ బాస్‌ని చూసిపోదాని. అతను కుక్కిమంచంలో పడుకుని గోళ్లు గిల్లుకుంటుంటే 'లేవయ్యా లే! బిజినెస్ చెయ్యి' అని యిందులోకి దించాను. చూస్తున్నారుగా! ఒకకోటికి పడగెత్తాడు. ఓ వెయ్యిమందికి భృతి కల్పిస్తున్నాడు. ఉన్నాడా అని అడిగితే బయటికి వెళ్లాడన్నారు. వెయిట్ చేస్తున్నా."

"లాబం లేదండీ, ఆయన ఇవాళ మరి రారు." అనేశా. నా పక్కన టెలిఫోన్ మోగింది.

"ఆ ఫూలింకా ఉన్నాడా? వెళ్లాడా?... ఓ పదిరూపాయలిచ్చి పంపండి. డబ్బుకోసం వచ్చి ఉంటాడు." బాస్ గొంతు.

*ముద్రణ : యువ, ఏప్రిల్ 1977*